క్లుప్తంగా

విజయ దశమికి ముస్తాబవుతున్న ఆలయాలు



ఏలేశ్వరంలో విజయదశమికి ముస్తాబైన అమ్మవారి ఆలయం

ఏలేశ్వరం: శ్రీదేవి శరన్నవ రాత్రుల్లో విశిష్టమైన విజయ దశమిని సోమవారం వైభవంగా నిర్వహించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. విజయ దశమి పురస్కరించుకుని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఉత్సవకమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. జేవీఆర్ ట్రస్టు చైర్మన్ జువ్విన వీర్రాజు, వీరరాఘవమ్మ దంపతుల ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక దిబ్బలపాలెంలోని సంతోషిమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి ఆలయం వద్ద దశమికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పట్టణంలోని తోటవీధిలో ఉన్న అమ్మవారి ఆలయం విశిష్టత సంతరించుకుంది. 1983 నుంచి తోటవీధిలో దశమి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈఏడాది తోటవీధిలో 40 ఏళ్ల ఉత్సవాలు పూర్తి చేసుకున్నాయి. అలాగే స్థానిక నర్సీపట్నంరోడ్, ఆర్టీసీకాంప్లెక్స్, సువ్వయ్యమ్మపేట, లింగంపర్తిలోని సుబ్బారావుకాలనీ, సత్రంపంపుకాలనీలో దశమి ఏర్పాట్లు చేస్తున్నారు. విజయదశమి వేడుకల అనంతరం అమ్మవారి విగ్రహాలను భారీ ఊరేగింపులతో నిమజ్జనం చేయడానికి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అలరించిన సంగీత విభావరి

కాకినాడ రూరల్: దసరా వేడుకల్లో భాగంగా కాకినాడ బీచ్ సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం జరిగిన సంగీత విభావరి అలరించింది. కళాకారులు బ్రహ్మానందం, పైల సత్యనారాయణ, వరలక్ష్మి తమ గానమాధుర్యంతో ఆకట్టుకున్నారు. వీరిని శిల్పారామం ఏఓ ప్రకాష్ సత్కరించారు.



మహిషాసురమర్దినిగా పూజలందుకున్న రత్నగిరి వనదుర్గమ్మ



ప్రత్యేక అలంకరణలో వాసవీమాత



ప్రత్యేక అలంకరణలో గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ



దుర్గాదేవిగా జగ్గంపేటలోని కనకదుర్గమ్మ



తాళ్లూరులో మహిషాసురమర్దినిగా పూజలందుకున్న విజయదుర్గమ్మ



కాకరపల్లిలో మహిషాసురమర్దినిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

అమ్మా భవానీ..!

- మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ అమ్మవారు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధిన నిర్వహిస్తున్న దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆశ్వీయుజ అష్టమి, ఆదివారం సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవారు, రత్నగిరి దుర్గామాతలు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లను మహిషాసురమర్దినిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారు సింహ వాహనంపై ఆశీనులై ధనస్సు, పాశం, బాణం, ఖడ్గం తదితర ఆయుదాలను ధరించి మహిషాసురుడిని సంహరించిన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పండితులు చండీహోమానికి అంకురార్పణ చేశారు. స్థానిక మెయిన్ రోడ్డులోని ఆంధ్రాబ్యాంకు వద్ద కొలువైన వాసవీ మాత అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేటి కార్యక్రమాలు

సోమవారంతో శరన్నవరాత్ర ఉత్సవాలు ముగియనున్నాయి. ఆరోజు వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు శాంతమూర్తి రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. రత్నగిరిపై దర్బారు మండపంలో చండీ హోమం, పూర్ణాహుతి నిర్వహిస్తారు. రామాలయం వెనుక ఉన్న శమీవృక్షం వద్ద శమీపూజ చేస్తారు. అనంతరం వెండి గజ వాహనంపై సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ఊరేగిస్తారు. రాత్రి శ్రీరాముడి వేషధారణలో ఉన్న వంద మంది చిన్నారులతో రావణ సంహారం చేయిస్తారు. ఇందుకు 20 అడుగుల ఎత్తున రావణుడి బొమ్మను సత్యదేవా జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేశారు.

మహిషాసురమర్దినిగా కనకదుర్గమ్మ

కోటనందూరు: కాకరాపల్లిలో కనదుర్గమ్మ అమ్మవారు ఆదివారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పండితులు అమ్మవారికి పూజలు, హోమాలు చేశారు. కేఈ చిన్నయ్యపాలెంలో లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

బోనాల ఊరేగింపు

ఏలేశ్వరం: శ్రీదేవి శరన్నవ రాత్రులు నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. దుర్గాష్టమి ప్రారంభం కావడంతో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. ఏలేశ్వరంలోని దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయం వద్ద నెలకొల్పిన అమ్మవారి ఆలయ కమిటీ, అజయ్‌చక్రవర్తి, రంజిత్‌చక్రవర్తి ఆధ్వర్యంలో బోనాల పండగ నిర్వహించారు. బోనాలతో 400 మంది మహిళలు పట్టణంలో ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయం నుంచి బాలాజీచౌక్, మెయిన్‌రోడ్, మార్కెట్‌రోడ్ మీదుగా బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో దుర్గమ్మ మాలధారణ చేపట్టిన భవానీలు పాల్గొన్నారు. మూది నారాయణస్వామి, మీసాల సత్యం, చల్లాప్రసాద్, ఒమ్మికృష్ణ, గూనాపు అశోక్, శిడగం సురేష్ మహిళలు పాల్గొన్నారు.

వనదుర్గమ్మకు సారె సమర్పణ

కిర్లంపూడి: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ, జగపతినగరం అభయ దుర్గమ్మ, చిల్లంగి, రామచంద్రపురం కనక దుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కిర్లంపూడిలోని వనదుర్గమ్మ అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. స్థానిక నూకాలమ్మ అమ్మవారి ఆలయ నుంచి గ్రామ వీధుల గుండా పలు రకాల స్వీట్లు, పండ్లను ఊరేగింపుగా తీసుకెళ్లి వనదుర్గమ్మకు సమర్పించారు. బోనాలు కూడా చెల్లించారు.

విజయదుర్గమ్మకు పూజలు

గండేపల్లి: తాళ్లూరు విజయదుర్గ అమ్మవారి పీఠంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి పూజలు చేసి, పారాయణం చేశారు. మాల ధరించిన భవానీలు విజయవాడకు కాలినడకన, వాహనాలపై తరలివెళ్లడంతో గ్రామంలో సందడి నెలకొంది.

దుర్గాదేవిగా అమ్మవారు

జగ్గంపేట: గ్రామంలోని దేవీ సెంటర్‌లో కనకదుర్గమ్మ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారి అలంకరణకు హైదరాబాద్‌కు చెందిన జటావల్లభుల కిరణ్, అపర్ణ దంపతులు చీర, అభరణాలు సమర్పించారు.

దేవీచౌక్ ఆలయంలో..

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలోని కనకదుర్గమ్మ అమ్మవారు ఆదివారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ అమ్మవారికి అలంకార పూజలు నిర్వహించారు. కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతి దంపతులు పీటలపై కూర్చొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విశేష సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వీరభద్రునిగడ్డె, వెలమపేటలోని ఊరకాలువ గట్టుపై ఉన్న కనకదుర్గమ్మ ఆలయాల్లో చండీ హోమం నిర్వహించారు.



ఏలేశ్వరంలో బోనాలతో మహిళల ఊరేగింపు



కిర్లంపూడిలో ఊరేగింపుగా తీసుకెళుతున్న సారె



దుర్గమ్మ అవతారంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ



కేఈ చిన్నయ్యపాలెంలో కనకదుర్గమ్మకు బోనాలు తీసుకొస్తున్న మహిళలు

పల్లెల అభివృద్ధికి పెద్దపీట

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- ఇండుగపల్లిలో సచివాలయం ప్రారంభం

కోటనందూరు: పల్లెల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. ఇండుగపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం సర్పంచులు కుంచే సత్యవతి, సుర్ల రాంబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ సీఎం జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకొచ్చారన్నారు. వలంటరీ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నారన్నారు. పల్లెల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లగా భావించి ముందుకెళ్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

గడప గడపకూ మన ప్రభుత్వం

ఇండుగపల్లిలో ఆదివారం మంత్రి దాడిశెట్టి రాజా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకొని ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాలనపై గ్రామస్తుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు కార్యక్రమానికి వచ్చిన మంత్రి రాజాకు మహిళలు హారతులతో, చిన్నారులు కోలాటంతో ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చిన బాబు, ఏపీబీ రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, మండలాధ్యక్షుడు సుర్ల రాజు, తుని ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, లోవదేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కుంచే అచ్చిరాజు, గుడివాడ ఆదినారాయణ, నల్లమిల్లి గోవిందు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, తహసీల్దార్ కుశరాజు, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇండుగపల్లిలో గ్రామసచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల సందర్భంగా ఆదివారం స్థానిక బాలాత్రిపురసుందరి ఆలయంలో బాలాత్రిపుర సుందరి కూచిపూడి డాన్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. 83 మంది కళాకారులు గణేశస్తుతి, అదిగో అల్లదిగో, ముద్దుగారే యశోద, శివస్తుతి, దుర్గాస్తుతికి శ్రీను, తిరుమల, రిజ్వానా, గాయత్రీ, రేణుక, శాంతి, షణ్ముఖ, జాహ్నవి, విజ్ఞసాయి, జాను, రూపానాయుడు, దేవిశ్రీ, ఝాన్సీలక్ష్మి, సోమ చేసిన నృత్యాలు అలరించాయి. ఐదేళ్ల చిన్నారి మోక్ష చేసిన నాగిని నృత్యం ఆకట్టుకుంది. అకాడమీ చైర్మన్ బేతా సత్యనారాయణ వీరిని మయూరి పురస్కారాలతో సత్కరించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

- రూ.80 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదివారం శ్రీకారం చుట్టారు. గ్రామంలో డ్రైనేజీల నిర్మాణాలకు, భావనారాయణపురంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. డ్రైనేజీ నిర్మాణాలను పరిశీలించి, అవుట్‌లెట్ల ఏర్పాటుపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ సర్పవరం గ్రామంలో రూ.80 లక్షలతో డ్రైనేజీలు నిర్మిస్తున్నామని వివరించారు. గడపగడపకూ కార్యక్రమంలో ప్రజల నుంచి డ్రైనేజీలు, రోడ్ల కోసం వినతులు రావడంతో, వీటి నిర్మాణాలను వేగవంతం చేశామన్నారు. త్వరలోనే వాటిని ప్రారంభిస్తామన్నారు. భావనారాయణపురంలో శెట్టిబలిజల కోసం బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గ్రామ నాయకులు పుల్ల చందు, పుల్ల కోటేశ్వరరావు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, వార్డు సభ్యుడు చక్రరావు, మండల ఇంజనీర్ వాసుదేవరావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వన్నెం మురళి తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



30 ఏళ్ల తరువాత కలుసుకున్న తుని బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు

తుని: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ పాఠశాలలో 1991 సంవత్సరం నుంచి 2015 సంవత్సరాల మధ్య విద్యనభ్యసించిన విద్యార్థినులంతా కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఒకరినొకరిని ఆలింగనం చేసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేశారు. అనంతరం తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

ఘనంగా దసరా పోటీల నిర్వహణ

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులో దసరా ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు కొవ్వూరు పంచాయతీ ఉప సర్పంచ్ పబ్బినీడి రమేష్‌బాబు ఆధ్వర్యంలో తారకరామనగర్‌లో తొలిసారిగా దసరా ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రెండు రోజులుగా మహిళలకు ఆటలు, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు. పదేళ్లలోపు పిల్లలకు ఫ్యాషన్ షోతో పాటు ఆటలు, పాటల పోటీలు జరిపారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్పంచ్ పిల్లి చక్రరావు, ఉప సర్పంచ్ పబ్బినీడి రమేష్‌బాబు, గుత్తుర్తి సత్య రాజేష్, వార్డు మెంబర్లు పి.నూకరాజు, మల్లాడి మల్లేష్, పబ్బినీడి చైతన్య, కాకి లక్ష్మి, నూకరాజు, పంతాడి ధర్మారావు తదితరులు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వ్యవసాయ మోటార్ చోరీ

ఏలేశ్వరం: లింగంపర్తి గ్రామంలో శనివారం అర్ధరాత్రి వ్యవసాయ మోటార్ చోరీకి గురైంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎ.సూర్యప్రకాశరవు పొలంలోని సుమారు రూ.25 వేలు విలువ చేసే సాగు నీరు అందించే మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రానున్న ఎన్నికల్లో జగనన్నదే విజయం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- శంఖవరం నుంచి అన్నవరం సత్యదేవుని సన్నిధి వరకూ బైక్ ర్యాలీ

శంఖవరం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి తిరిగి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. నవంబర్ ఒకటో తేదీన ప్రారంభించున్న ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం విజయవంతం కావాలని కోరుతూ ఆదివారం స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని శంఖవరం ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ శంఖవరంలో ప్రారంభమై రౌతులపూడి, ఎస్.అగ్రహారం, పారుపాక, మండపం మీదుగా అన్నవరం సత్యదేవుని సన్నిధికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి సత్యదేవున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన ఐదు వేల మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి ఈ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, నీరుకొండ సత్యనారాయణ, పర్వత రాజబాబు, శెట్టిబుత్తుల కుమార్‌రాజా, ఈగల అప్పారావు, నరాల శ్రీను, గాబు కృష్ణ, గొల్లు చినదివాణం, వాసిరెడ్డి భాస్కర్‌బాబు, జిగిరెడ్డి శ్రీను, రామిశెట్టి చినబాబు, పంచాది వీరబాబు, గోళ్ల కాంతి సుధాకర్, దోశే చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అంటే' అనే కార్యక్రమంపై ప్రచారం చేస్తూ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు నాయకులు భారీగా పాల్గొన్నారు. శంఖవరం నుంచి ప్రాంభమైన ఈ ర్యాలీ మండలంలోని మెరకచామవరం, శృంగవరం, బంగారయపేట, రౌతులపూడి, గిడజాం, ఎస్.అగ్రహారం, పారుపాక మీదుగా కొనసాగింది. శంఖవరం మండలంలో మండపం మీదుగా అన్నవరం వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ఏఎంసీ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మెన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయుకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుల బైక్ ర్యాలీ

ఏలేశ్వరం: రాష్ట్రానికి ఎందుకు జగనే కావాలి కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా బైక్ ర్యాలీ జరగగా మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే రావాలి..

అన్నవరం: పల్లెల్లో అభివృద్ధి జరగాలన్నా, పేదలందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలన్నా వచ్చే ఎన్నికల్లో జగనన్నే మళ్లీ అధికారంలోకి రావాలని ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్ర ప్రసాద్ అన్నారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న ×మళ్లీ జగన్ ఎందుకు కావాలంటే× కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సుమారు 10వేల బైక్‌లపై శంఖవరం నుంచి రౌతులపూడి మండలం మీదుగా అన్నవరానికి ర్యాలీ చేశారు. ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు ఈ ర్యాలీ సత్యదేవుని తొలి పాంచా వద్దకు చేరింది. అక్కడ ఎమ్మెల్యే పర్వత కొబ్బరి కాయ కొట్టి సత్యదేవునికి పూజలు చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ గత తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు పేరుతో టీడీపీ నాయకులు అడ్డగోలుగా ప్రజాధనాన్ని దోచుకున్నారని తెలిపారు. లబ్ధిదారులకు సగం, జన్మభూమి కమిటీలకు సగం చొప్పున దోపిడీ కొనసాగిందన్నారు. అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయంలో నేరుగా నిధులు లబ్ధిదారుని అకౌంట్‌లోకి జమ అవుతున్నాయన్నారు. ఇదే పరిస్థితి కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సి ఉందన్నారు. ఈ విషయమే నవంబర్ ఒకటో తేదీ నుంచి ఇంటింటికీ తిరిగి చెప్పాలని కార్యకర్తలను ఆయన కోరారు. సీఎం జగన్ మాత్రం కులం, మతం, పార్టీ భేదం లేకుండా పేద, మధ్యతరగతి ప్రజల గుండెల్లో ఉన్నాడని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు అలమండ చలమయ్య, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో కార్యకర్తలకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్



తొలిపాంచా వద్ద సత్యదేవునికి పూజలు చేస్తున్న ఎంఎల్ఏ పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్



ఏలేశ్వరంలో బైక్‌ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు